www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 8 ఫిబ్రవరి 2024

భాషా పరిశోధకుడు వేటూరి ప్రభాకర్ శాస్త్రి

ప్రజాశక్తి-కడప అర్బన్: ప్రాచీన గ్రంథ పరిష్కర్తగా, శాసన పరిష్కర్తగా తాటి ఆకుల్లో చితికి పోతున్న, చెదపట్టిన ఎంతో సారస్వతాన్ని పునరుద్ధరించిన మహానుభావుడు వేటూరి ప్రభాకర శాస్త్రి అని ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ గానుగపెంట హనుమంతరావు నివాళులర్పించారు. బుధవారం మొల్ల సాహితీ పీఠం కార్యాలయంలో వేటూరి ప్రభాకర శాస్త్రి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేటూరి ప్రాచీన తాళపత్ర గ్రంధాల సేకరణకై గ్రామ గ్రామాన పర్యటించి తెలుగు జాతికి అందించిన సాహితీ వేత్తని కొనియాడారు. సన్మానాలు, బిరుదులు మత్తు పదార్థాల వంటివి వీటితో విర్రవీగితే గర్వంతో ఏ పని ముందుకు సాగదని నిరాడంబరంగా సాహితీ లోకానికి చాటిన ఆదర్శకవి వేటూరి అని పేర్కొన్నారు. వేటూరి ప్రభాకర్ శాస్త్రి కృష్ణా జిల్లా దివిసీమలోని పెద్ద కల్లేపల్లి గ్రామంలో 1888, ఫిబ్రవరి 7వ తేదీన జన్మించి 1950, ఆగస్టు 29న శారదా దేవి ఆరాధనలో తుది శ్వాస విడిచారన్నారు. తొలుత వేటూరి ఆత్మశాంతికి సభ మౌనం పాటించారు.

నిరాశే!

ఉక్కు పరిశ్రమ ఊసే లేదు - వైఎస్ఆర్ ఇఎంసి ప్రస్తావన

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

2024-25 ఓటాన్ బడ్జెట్ తీవ్ర నిరాశను కలిగించింది. జిల్లా ప్రగతికి కీలక రంగాలైన నీటి పారుదల, వ్యవసాయం, పారిశ్రామిక, సేవల రంగాల పురోభివృద్ధికి అవసరమైన కేటాయింపుల్లో స్పష్టత కొరవడింది. జిల్లా జీవనాడిగా పరిగణ పొందిన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, దాని పురోగతికి సంబంధించి ఎటువంటి ప్రస్తావన చేయకపోవడం విస్మయాన్ని కలిగించింది. వైఎస్ఆర్ ఎలక్ట్రానిక్ క్లస్టర్‌లో పరిశ్రమల ఏర్పాటుకు మౌలిక సదుపాయాల కల్పన విస్మరించింది. వ్యవసాయం, సాగునీటిపారుదల, పారిశ్రామిక రంగాలకు మూడు, నాలుగు నెలల వ్యయానికి సంబంధించిన కీలక రంగాలకు చేయాల్సిన వ్యయాల్ని సైతం నిర్లక్ష్యం చేసినట్లు కనిపిస్తోంది.

రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం రూ.2,86,389 కోట్లతో 2024-25 ఓటాన్ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. జిల్లాకు సంబంధించిన కేటాయింపులను పరిశీలిస్తే తీవ్ర నిరుత్సాహాన్ని కలిగించింది. సాగునీటిరంగ కేటాయింపుల ప్రస్తావన సైతం చేయలేదు. కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలతో ముడిపడిన జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్, కెసికెనాల్ కేటాయింపులు చేయకపోవడం ఆందోళన కలిగించింది. మూడు, నాలుగు నెలల స్వల్పకాలిక ఓటాన్ బడ్జెటే అయినప్పటికీ ప్రాధాన్య, ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకు కేటాయింపుల ప్రస్తావన లేదు. గత బడ్జెట్‌లో జిఎన్ఎస్ఎస్‌కు రూ.855.35 కోట్లు, పిబిసికి రూ.106.59 కోట్లు, హెచ్ఎన్ఎస్‌కు రూ.122.69 కోట్లు, వెలిగల్లుకు రూ.1.5 కోట్లు, చెయ్యేరుకు రూ.20 లక్షలు కేటాయింపులు చేసిన సంగతి తెలిసిందే. 2023-24 బడ్జెట్‌లో రూ.1542.17 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఏమేరకు కేటాయించారనే విషయంపై స్పష్టత లేకుండా పోయింది. గత బడ్జెట్‌లో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు రూ.2,200 కోట్లు కేటాయించగా ప్రస్తుత బడ్జెట్‌లో ఉక్కు పరిశ్రమ ప్రస్తావనే చేయలేదు. గతేడాది వైఎస్ఆర్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో ఆల్‌డిక్సన్ పరిశ్రమ ప్రారంభోత్సవం సమయంలో కుదర్చుకున్న రూ.450 కోట్లతో ఎంఒయును ప్రస్తావించడంతో సరిపెట్టింది. గత బడ్జెట్‌లో పులివెందుల అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ, పులివెందుల్లో వెటర్నరీ బయోలాజికల్ ఇన్స్టిట్యూట్‌లో ముర్రాజాతి గెదేల ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. యోగి వేమన యూని వర్శిటీకి రూ.32.83 కోట్లు, సిపిబ్రౌన్‌కు రూ.10 లక్షలు, చొప్పున కేటాయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుత బడ్జెట్‌లో ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ ఏర్పాట్లు చేస్తున్నామనే పాత ప్రస్తావనను వల్లెవేశారు. ఉమ్మడి జిల్లాలోని 4.80 లక్షల మంది రైతులకు రూ.33,300 కోట్లతో వైఎస్ఆర్ రైతు భరోసా, రూ.1835 కోట్లతో సున్నా వడ్డీ పథకం కింద లబ్ధి పొందనున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్నమయ్య, పింఛా, ఎల్ఎస్‌పి, కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తిపోతల పథకాల పనులకు సంబంధించిన కేటాయింపుల ప్రస్తావన చేయలేదు.

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

- కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాఘవరెడ్డి

మాట్లాడుతున్న కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వి.రాఘవరెడ్డి

ప్రజాశక్తి - కడప

భూ హక్కు చట్టం 2022ను తక్షణం రద్దు చేయాలని, ఈ నెల 24వ తేదీ వరకు న్యాయవాదులు విధులు బహిష్కరించాలని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి.వి.రాఘవరెడ్డి అన్నారు. బుధవారం కడప జిల్లా కోర్టులోని కడప బార్ అసోసియేషన్ సమావేశ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు ఈ మేరకు తీర్మానం చేశారు. ఈ చట్టం వల్ల ప్రజల స్థిరాస్తి హక్కులకు భంగం వాటిల్లుతుందని సమావేశంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా ఆస్తి హక్కులను నిర్ణయించే అధికారాన్ని సివిల్ కోర్టు పరిధి నుంచి తీసేసి రెవెన్యూ అధికారులను ట్రిబునల్ చైర్మన్‌గా పెట్టి వారికి అప్పగిస్తారన్నారు. ఈ ట్రిబునల్‌కు సివిల్ ప్రొసీజర్ కోడ్, ఎవిడెన్స్ యాక్ట్, స్పెసిఫిక్ రిలీఫ్ యాక్ట్, లిమిటేషన్ యాక్ట్ లతో సంబంధం లేకుండా కేవలం సహజ సూత్రాల ఆధారంగా టైటిల్ డిసైడ్ చేస్తారన్నారు. ఈ సహజ న్యాయ సూత్రాలకు సంబంధించి ఇంతవరకు ఎటువంటి చట్టాలు రూపొందించలేదన్నారు. ట్రిబునల్ వ్యవస్థ ద్వారా ప్రజల ఆస్తి హక్కులు పెత్తందారులు, రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీల నాయకుల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. దీంతో వారి చేతుల్లో ఈ యాప్ పూర్తిగా దుర్వినియోగం అవుతుందన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి ఈ చట్టంపై పునరాలవచన చేసి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వివిధ రూపాల్లో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.ఎస్.బాలసుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి వై.టి.జె.కెనడీ, సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

'ఎస్‌సి, ఎస్‌టి రాయితీలపై గళమెత్తాలి'

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ సబ్సిడీలపై గళమెత్తాలని దళిత, గిరిజన పారిశ్రామిక సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.ఎన్.రాజా కోరారు. బుధవారం నగరంలోని ఆర్అండ్‌బి బంగ్లాలో మాజీ ఎంపీ హర్షకుమార్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021-24 వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా 8,995 దళిత గిరిజన పారిశ్రామిక వేత్తల కుటుంబాలకు సంబంధించిన రూ.625.19 కోట్ల రాయితీల విడుదల కాలేదని తెలిపారు. 2021 నుంచి 2024 వరకు సబ్సిడీ నిధులు విడుదల కాలేదని చెప్పారు. 2021లో సబ్సిడీ నిధులు విడుదల చేసే సంక్షేమ కేలండర్‌ను ముఖ్యమంత్రి 2022 మార్చిలో ఒకేసారి, జూలైలో మరొకసారి, 2024 ఫిబ్రవరిలో రిలీజ్ చేస్తానని చెప్పి రెండున్నరేళ్లు పూర్తవుతోందన్నారు. సబ్సిడీ ఊసే ఎత్తకపోవడం దారుణమని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లోనైనా బడ్జెట్ ప్రవేశపెడతాడని ఎదురు చూశామని, నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా దళిత, గిరిజన పారిశ్రామిక వేత్తలకు సేవా రంగంలో 45 శాతంతో రూ.75 లక్షల వరకు ఉత్పత్తి రంగంలో 45 శాతంతో రూ.కోటి వరకు గరిష్టంగా రాయితీలను అందించారని చెప్పారు. 2021, సెప్టెంబర్ 3 నుంచి ఇప్పటి వరకు రావలసిన వైయస్సార్ జగనన్న బడుగు వికాసం రాయితీలను ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా దళితులు నిర్వహిస్తున్న 7,675 యూనిట్లుకు రూ.542.95 కోట్లు, గిరిజనులు నిర్వహిస్తున్న 1320 యూనిట్లకు రూ.82.24 కోట్లు రావలసి ఉందని చెప్పారు. 11వ తేదీన జరగబోయే దళిత గిరిజన సింహ గర్జన సభలో ఈ సమస్యను లేవనెత్తాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, దళిత గిరిజన పారిశ్రామికవేత్తలు, తమరికి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఓబయ్య, గోవర్ధన్, సుబ్బరాయుడు, శ్రీను, రాము, గంగన్న పాల్గొన్నారు.

కడప ఎంపీ, అసెంబ్లీ స్థానాలకు 'బండి' దరఖాస్తు



దరఖాస్తు చేస్తున్న సుమంత్‌కుమార్

ప్రజాశక్తి-కడప

2024లో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తరపున కడప పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థిగా కడప జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బండి సుమంత్ కుమార్ బుధవారం విజయవాడలోని ఆంధ్ర రత్న భవన్‌లో దరఖాస్తులు దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి వారికి అండగా ఉంటూ అనేక పోరాటాలు చేశానన్నారు. ఒక ప్రజాప్రతినిధిగా ఎన్నికయి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేటందుకు శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బద్వేల్ అసెంబ్లీకి కమల్ ప్రభాస్..

కలసపాడు : రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో బద్వేల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కమల్ ప్రభాస్ నామినేషన్ దాఖలు చేశారు. రానున్న 2024 ఎన్నికల దృష్ట్యా దరఖాస్తు చేసుకున్నానని ఆయన తెలిపారు. గతంలో బద్వేల్ నియోజకవర్గ యువత ఇన్‌ఛార్జిగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేస్తున్న కమల్ ప్రభాస్

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఉషారాణి

రూ.23 కోట్లతో గ్రంథాలయాల ఆధునికీకరణ

- చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలో రూ.23 కోట్లతో గ్రంథాలయాలను ఆధునికీకరించనున్నట్లు చైర్‌పర్సన్ లింగాల ఉషారాణి అన్నారు. బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2024-25 సంవత్సరాని సంబంధించి గ్రంథాలయాల అభివృద్ధి కొరకు సుమారు రూ.23 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు ఆమోదించారు. కొత్త పుస్తకాల కొనుగోలుకు రూ.1.50 కోట్లు, కంప్యూటర్స్, జిరాక్స్ మిషన్,ఫర్నిచర్స్ కొనుగోలుకు రూ.40 లక్షలు, నూతన భవన నిర్మాణాల కొరకు రూ.3 కోట్లు, గ్రంథాలయాల ఆధునికీకరణ కొరకు రూ.5 కోట్లు, రూ.60 లక్షలు, సిబ్బంది జీతాలు, పెన్షన్లు, పౌరుగు సేవల సిబ్బంది వేతనాలు రూ.13.63 కోట్లు ఆమోదించారు. 5 సంవత్సరాల కంటే ఎక్కువగా 2023-2024 సంవత్సరం జనవరి వరకు వివిధ మున్సిపాలిటీలు, పంచాయతీల గ్రంథాలయ సెస్స్ ద్వార సుమారు రూ.3.57 కోట్లు జిల్లా గ్రంథాలయ సంస్థకు జమ చేశాయి. ఇంకా వసూలు కావలసిన గ్రంథాలయ సెస్స్ బకాయి మొత్తం సుమారుగా రూ.9 కోట్లు వివిధ మున్సిపాలిటీలు, పంచాయతీలు జిల్లా గ్రంథాలయ సంస్థల నిధులకు జమచేయవలసి ఉన్నది. ఈ సెస్స్ బకాయిల వసూలు కొరకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశానికి డిఇఒ కార్యాలయ సూపరింటెండెంట్ బాదుల్లా, వయోజన విద్యా ఉప సంచలకులు వెంకట సుబ్బారెడ్డి, డిఎల్‌పిఒ మస్తాన్‌వల్లి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సయ్యద్ అమీరుద్దిన్, సీనియర్ అసిస్టెంట్ రాజ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస చార్, ఉప గ్రంథాలయ అధికారి పవన్ కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

పట్టణంలోని గ్రంథాలయానికి సైకాలజీ అధ్యాపకులు అల్లం శ్రీనివాస్ పుస్తకాలు అందజేశారని గ్రంథాలయ అధికారి ఆఫ్రిది పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో పాఠకుల సంఖ్య పెరగడం చూసి విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉపయోగ పడే పుస్తకాలు డీఎస్సీ, గ్రూప్స్ తదితర పోటీ పరీక్షలకి ఉపయోగ పడే సైకాలజీ, జనరల్ స్టడీస్ మెటీరియల్‌ను వితరణగా అందజేశారన్నారు. ఉపయోగపడే పుస్తకాలు ఉన్న వితరణగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలియ జేసారు. వారికి లైబ్రరీ తరపున ధన్యవాదములు తెలియ జేశారు. కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యవర్గ సభ్యులు ఖాసీంవల్లి, పాఠకులు రంగనాయకులు, యస్వీత పాల్గొన్నారు.

పుస్తకాలు అందజేస్తున్న శ్రీనివాస్

విభిన్నప్రతిభావంతుల్లో ఉత్సాహాన్ని నింపండి

- ఎస్ఎస్ఎ పిఒ అంబవరం ప్రభాకర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప సిటీ

విభిన్నప్రతిభావంతుల్లో ఉత్సాహం నింపాలని సమగ్ర శిక్ష పథకాధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో నూతనంగా విధులలో చేరిన సహిత విద్యా రిసోర్స్ పర్సన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతులు విధి వంచితులు కాకుండా విధాతలుగా మారేలా వారిలో ఉత్సాహాన్ని ధైర్యాన్ని నింపాలని సహిత విద్యా రిసోర్స్ పర్సన్‌లను కోరారు. విధి నిర్వహణలో తోటి ఉపాధ్యాయులతో అధికారులతో, పిల్లల తల్లిదండ్రులతో, ప్రజలతో సన్నిహితంగా ఉంటూ విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడం, ఎప్పటికప్పుడు నూతన విషయాలను తెలుసుకోవడం, మంచి భాషను ఉపయోగించడం చేయాలన్నారు. అవసరమైన వారికి సేవలు అందించడంలో ఆనందం వెతుక్కోవాలని సూచించారు. సహిత విద్యా సమన్వయకర్త మిట్టా కేశవరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల చట్టాలను తెలుసుకొని వారికి అందాల్సిన అలవెన్సును, ఉపకరణాలను సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సహిత విద్యా రిసోర్స్ పర్సన్లు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకొని విభిన్నప్రతిభావంతుల విద్యార్థులను చైతన్యవంతులుగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో అక్కడనిక్ మానిటరింగ్ అధికారిని ధనలక్ష్మి, సమగ్ర శిక్ష కార్యాలయ సూపర్డెంట్ మురళీమోహన్,జీసీడివో విజయలక్ష్మి, ఏపీవో రజనీకాంత్‌రెడ్డి, దశరథ రామిరెడ్డి, రామాంజనేయరెడ్డి, ప్లానింగ్ అధికారి లక్ష్మీనరసింహరాజు, ఆర్పీలు విజయ, మమత, సిద్ధారెడ్డి, గంగులప్ప తదితరులు పాల్గొని ఇటీవల జిల్లా ఉత్తమ అధికారిగా కలెక్టర్‌చే ప్రశంసపత్రం స్వీకరించిన డాక్టర్ ప్రభాకర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు.

విభజన హామీల అమలులో కేంద్రం నిర్లక్ష్యం : డివైఎఫ్ఐ

ఢిల్లీ ఎపి భవన్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన కోసం ప్రత్యేక హోదా సాధన సమితి, వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల అధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ భవన్, అంబేద్కర్ విగ్రవం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ విభజన హామీలు అమలు చేయడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు విభజన సమయంలో ప్రత్యేక హోదా కల్పిస్తామని, పది సంవత్సరాలు ఇస్తామని చెప్పి నాడు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తొమ్మిది సంవత్సరాలలో హోదా హామీ గాలికి వదిలేశారని విమర్శించారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం హోదా ఎవరు ఇస్తే వారికే మద్దతు 25కి 25 ఎంపీలు ఇస్తే హోదా ఎందుకు రాదో అని చెప్పి 23 ఎంపీ స్థానాలు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇస్తే పార్లమెంటులో కొట్లడకుండా కేంద్రాన్ని నిలదీయకుండా రాష్ట్ర భవిష్యత్తును సొంత ప్రయోజనాల కోసం తాకట్టు పెట్టారని పేర్కొన్నారు. ఎంతవరకు కొట్లాడారు రాష్ట్ర ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం చివరి పార్లమెంటు సమావేశాలు అయిన కేంద్రాన్ని నిలదీసి రాష్ట్ర విభజన హామీల కోసం తెలుగోడు పౌరుషాన్ని ఢిల్లీలో చూపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోవు 2 నెలల్లో ఎన్నికల నేపథ్యంలో ప్రజలు, యువత ఓటు ద్వారా తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అంతేకాకుండా కడప ఉక్కు కోసం గురువారం జంతర్మంతర్ వద్ద నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు పాల్గొన్నారు

నేటి నుంచి వైవీయూ పీజీ పరీక్షలు

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన యూనివర్సిటీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల, అనుబంధ కళాశాలల ఎంఎ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంపిఈడి మొదటి సెమిస్టర్ పీజీ పరీక్షలు ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 8, 12, 14, 16, 19, 21o తేదీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లతో నిర్ణీత సమయానికి పరీక్షలకు హాజరు కావాలని తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థి మృతి

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని తెల్లపాడు గ్రామంలో 8వ తరగతి చదువు చదువుతున్న మౌనిక అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆమె మృతితో కుటుంబీకులు, బంధువులు, విద్యార్థులు విషాదంలో మునిగిపోయారు. కొద్ది కాలంగా ఆమె అనీమియా వ్యాధితో బాధపడుతున్నారు. విద్యార్థి మరణించిన విషయం తెలుసుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిత్తా ప్రభావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు మౌనిక భౌతికాయానికి నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులకు ఊరటనందించారు.

11న దళిత సింహగర్జన : మాజీ ఎంపీ

ప్రజాశక్తి-కడప అర్బన్

రాజమండ్రిలో ఈ నెల 11వ తేదీన నిర్వహించే దళిత సింహ గర్జన సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎంపీ హర్ష కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం దళిత సింహ గర్జన జిల్లా ఇన్‌ఛార్జి మూరతోటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో దళిత సింహ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హర్షకుమార్ మాట్లాడాతూ ప్రస్తుత ప్రభుత్వం దళితులకు చెందిన 26 స్కీంలు తొలగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు దళితులకు సబ్సిడీ కింది లోన్లు ఇవ్వగా, ఈ ప్రభుత్వం ఒక్క లోను కూడా ఇవ్వలేదన్నారు. పభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం చెబుతున్నా వాస్తవానికి పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తోందన్నారు. వసతి దీవెన, విద్యా దీవెన డిగ్రీ వరకు కుదించారని, దళితులు ఉన్నత విద్యను అభ్యసించకుండా చేస్తున్నారన్నారు. కడప జిల్లాలో కొత్తగా వచ్చిన మెడికల్ కాలేజీలో సగం సీట్లు అమ్ముకుంటున్నారని, అమ్మ ఒడి పథకానికి ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు వాడుకోవడం తగదన్నారు. అంబేద్కర్ విగ్రహం ప్రభుత్వం నిధులతో నిర్మించలేదన్నారు. జగన్ ముఖ్యమంత్రి అయితే జీవితం బాగుంటుందని దళితులు భావించారని, తీరా అధికారంలోకి వచ్చాక దళిత వర్గాలు నిరాశ స్పృహలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని దళిత నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి-కడప

జిల్లా యువజన సర్వీసుల శాఖ(స్టెప్) ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సలీం భాష మాట్లాడుతూ ఆధునిక విద్యా విధానం మానవులను సమాజానికి అనుకూలంగా తీర్చి దిద్దేందుకు శిక్షణ ఇస్తుందని చెప్పారు. సామాజిక అభివృద్ధిలో విద్య పాత్ర మహెూన్నతమైనదని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు ఉమా మహేశ్వరీ, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ గురు మోహన్‌రెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి, స్టెప్, మేనేజర్, వి.వి.సుబ్బారాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రశాంతి

జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపిపి సురేష్‌యాదవ్

గృహ నిర్మాణాల్లో నిర్లక్ష్యం వహించొద్దు : ఎంపిపి

ప్రజాశక్తి-చెన్నూరు

జగనన్న గృహ నిర్మాణాలను పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వద్దని ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ అన్నారు. బుధవారం కనపర్తి జగనన్న లే అవుట్‌లను హౌసింగ్ డిఇ గంగన్న, ఎఇ మేనిల్‌లతో కలసి అక్కడ జరుగుతున్న పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇంటి నిర్మాణాల విషయంలో అధికారులంతా సమన్వయంతో పనిచేసి చిన్న చిన్న పనులు, డోర్లు, కిటికీలు, బాత్రూములు వంటివన్నీ పూర్తిచేసి ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ నెల ఆఖరి కల్లా లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేయాలని పేర్కొన్నారు. వీలైనంత తొందరగా పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఈనెల ఆఖరి కల్లా అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు.

డ్రెయినేజీ పనులు పరిశీలన

చెన్నూరు రాజుల కాలనీ నుండి సరస్వతి నగర్, లక్ష్మీ నగర్, యానాదికాలనీ, గాంధీనగర్, బెస్త కాలనీల మీదుగా జరుగుతున్న ప్రధాన డ్రెయినేజీ కాలువ పనులను ఎస్ఇ ఎంసి వీరన్న, డిఇ మురళి కొండారెడ్డి, ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ పర్యవేక్షించారు, సుమారు రూ.45 లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన ఈ పనులను వారు పర్యవేక్షించడంతో పాటు వారు కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ ఎక్కడికక్కడ రాజీపడకుండా పనులను నాణ్యతతో నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో ఎఇ వినోద్ కుమార్‌రెడ్డి, కాంట్రాక్టర్ నీలం వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : 'పుత్తా'

ప్రజాశక్తి-చెన్నూరు : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం చెన్నూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నేతలు నేలటూరి వెంకట రమణారెడ్డి పొట్టిపార్టీ హనుమాన్‌రెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, నెల్లూరు సుబ్బారెడ్డి, పొట్టిపాటి రాజగోపాల్‌రెడ్డి టిడిపిలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి పుత్తా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కల్లూరు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు కొంచెం రామకృష్ణారెడ్డి, రాష్ట్ర రైతు సంఘం నాయకులు మల్లికార్జునరెడ్డి, సీనియర్ మైనార్టీ నాయకులు షబ్బీర్ హుస్సేన్, ఆవుల పవన్ కుమార్‌రెడ్డి, బాలగిరి పెద్ద సుబ్బారెడ్డి, మోహన్‌రెడ్డి, జడ లక్ష్మీనారాయణ, విశ్వం, చెన్నయ్య పాల్గొన్నారు.

సైనికుల్లా కష్టపడితే విజయం టిడిపిదే

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలోని మహానందిపల్లి గ్రామ పంచాయతీలో తెలుగుదేశం అభ్యర్థి బొజ్జా రోషన్న ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ సహకారంతో ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పేర్కొన్నారు. అప్పుడే తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో టిడిపికి ఓట్లు వేసి గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పి.వెంకట్రామిరెడ్డి, ఎ.సోమిరెడ్డి, మాజీ సర్పంచ్ కల్లూరి దుగ్గిరెడ్డి, టిడిపి యువ నాయకులు మస్తానయ్య, ఎ.శ్రీనివాసులు రెడ్డి, వెంకటరెడ్డి, లక్క, సుబ్బయ్య, రమేష్, రామాంజనేయరెడ్డి, డిష్ శేఖర్‌రెడ్డి, నాగేంద్ర రావు, నారాయణ రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి అసెంబ్లీ అభ్యర్థి రోషన్న

మాట్లాడుతున్న నంద్యాల కొండారెడ్డి

శక్తి వంచన లేకుండా టిడిపి గెలుపునకు కృషి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో టిడిపి గెలుపు కోసం శాయశక్తులా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి కుమారుడు నంద్యాల కొండారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక నెహ్రూరోడ్‌లోని తమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన తండ్రి వరదరాజులరెడ్డి అధికారం కోసం ఎప్పుడూ పాకులాడలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి చేసిన ఆరోపణలు నిరాధారమైనవని కొట్టి పారేశారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల కొండారెడ్డి అని ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నది న్యాయవాది పద్మనాభరెడ్డి అని అన్నారు. దీన్ని చూసిన తాము పద్మనాభరెడ్డితో మాట్లాడి వెంటనే ఆ పోస్టును డిలీట్ చేయించామని, ఎవరూ కూడా ఆ పోస్టును గ్రూపులలో పెట్టలేదన్నారు. దీనిపై మాట్లాడిన మల్లెల లింగారెడ్డి ఒక్కసారి ఎవరు ఆ పోస్ట్ చేశారనే విషయం తెలుసుకొని మాట్లాడి ఉంటే బాగుండేదన్నారు. తాము పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. తాము పార్టీలో ఉన్నామా.. లేమా అనేదానికి ఒక చిన్న ఉదాహరణ చెబుతున్నామని పార్టీ తరపున నిర్వహించిన సర్వేలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎవరుంటే బాగుంటుంది అన్న వాయిస్‌లో వరదరాజులురెడ్డి పేరు కూడా ఉందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఎవరో మాట్లాడితే తాము వివరణ ఇవ్వాల్సిన అవసరం లేదని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ఉంది కాబట్టి ఈ విషయాన్ని చెబుతున్నట్లు కొండారెడ్డి వివరించారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు ఘంటసాల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ పుల్లయ్య, న్యాయవాది గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

టిడిపిని ఆదరించండి.. అభివృద్ధి చేసుకుందాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వచ్చే ఎన్నికల్లో టిడిపిని ఆదరిస్తే అభివృద్ధి చేసుకుందామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సి.భూపేష్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 13,19 వార్డుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే మున్సిపాలిటీ పరిధిలో పన్నులు తగ్గిస్తామమన్నారు. ప్రతి ఇంటికి తాగునీరు అందేలా కుళాయి కనెక్షన్ ఇప్పిస్తామన్నారు. మహిళలకు ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు రూ.1500 అందిస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, దేవగుడి యూత్ నాగేశ్వరరెడ్డి, ముర్రా బాలపుల్లారెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి గైబువలి, బూత్ ఇన్‌ఛార్జి ముద్దన శంకర్‌రెడ్డి, శివ నారాయరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, అయూబ్, ఫక్రుద్దీన్, చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డి బాబు, వెంకటరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బందుల్లేకుండా చర్యలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తహశీల్దార్ భీమేశ్వరరావు, ఎంపిడిఒ సల్మాన్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని బిదనంచర్ల, గురజాల, సింహాద్రిపురం గ్రామాల పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించారు. ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ ఓబయ్య పాల్గొన్నారు.

వేంపల్లె : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను తహశీల్దార్ వెంకటేశ్వర నాయక్ పరిశీలించారు. బుధవారం మండలంలోని తాళ్ళపల్లె, కుప్పాలపల్లె, బక్కన్నగారిపల్లె, టి.వెలమవారిపల్లె, గిడ్డంగివారిపల్లిల్లో ఉన్న పోలింగ్ బూత్‌లను పరిశీలించి పోలింగ్ కేంద్రాల్లో ఉన్న సౌక ర్యాలను తనిఖీ చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సౌకర్యంతోపాటు ఇతర వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎంపిడిఒ సంపతి దివిజా, మండల సర్వేయర్ శివారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికతోనే ఎంచుకున్న లక్ష్యం చేరుతారు

- జిల్లా ఎన్నికల సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జాతీయ లోక్ అదాలత్‌లో అనుకున్న లక్ష్యాన్ని చేరేందుకు చక్కటి ప్రణాళిక వేసుకోవాలని జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. బుధవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకర్స్‌చే జడ్జి భార్గవి సమీక్షించారు. ఈ సందర్భంగా బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ మార్చి 9న దేశవ్యాప్తంగా మెగా లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. గతంలో జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు నుండి అత్యధిక కేసులు పరిష్కరించామన్నారు. ఇదే విధానాన్ని కొనసాగించాలని సూచించారు. ముందుగా అన్ని విభాగాలచే టీలను ఏర్పాటు చేసుకొని, ప్రతి శనివారం కొన్ని కేసులను ఎంపిక చేసుకొని మెగా లోక్ అదాలత్‌కు సిద్ధం చేయాలన్నారు. ముందుగా సబ్‌జైలును విజిట్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీలు సి.నారాయణరెడ్డి, మురళీధర్‌రెడ్డి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఐశ్వర్య, సీనియర్ న్యాయవాది సుబ్బారావు, బ్యాంక్ అధికారులు, కోర్టు పరిధిలోని సిఐలు, కానిస్టేబుళ్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పాఠశాలకు కూల్ వాటర్ క్యాన్లు వితరణ

ప్రజాశక్తి - వేంపల్లె

వాటర్ క్యాన్లు అందజేస్తున్న అనసయ్య

స్థానిక తలిశెట్టి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు 10 కూల్ వాటర్ క్యాన్లను చింతల మడుగు పల్లెకు చెందిన మండ ల కో-ఆప్షన్ మెంబర్ పగిడి పల్లె అనసయ్య వితరణ చేశారు. బుధవారం పాఠశాల హెచ్ఎం శివ మునెమ్మకు క్యాన్లను అంద జేశారు. ఈ సందర్భంగా పగిడిపల్లె అనసయ్య మాట్లాడుతూ తన కుమారుడు తలిశెట్టి జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో విద్యను అభ్యసించినట్లు చెప్పారు. తన కుమారుడు విద్య అభ్యసించిన పాఠశాలకు తన వంతు సహకారం చేయాలనే ఆశయంతో విద్యార్థులకు తాగునీటి కోసం ఉపయోగపడేలా కూల్ వాటర్ క్యాన్లను అందజేసినట్లు చెప్పారు. తన కుమారుడికి పోస్టల్ శాఖలో ఉద్యోగం వచ్చిందని చెప్పారు. హెచ్ఎం శివ మునెమ్మ మాట్లాడుతూ విద్యార్థులందరూ చక్కగా చదివి ప్రయోజకులై పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. పాఠశాల వార్షికోత్సవ సందర్భంగా క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు వైఎస్ఆర్ టిఎన్ జిల్లా అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, వికాస్ పాఠశాల కరస్పాండ్ నజీర్‌బాషా, కో-ఆప్షన్ మెంబర్ పగిడిపల్లె అనసయ్య బహుమతులు ప్రదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ చంద్రారెడ్డి, రాజశేఖర్, చంద్రమోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, బాబు, మహబూబ్ బాషా, ధర్మారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అసెంబ్లీ స్థానానికి అవకాశం కల్పించండి

జమ్మలమడుగు రూరల్: 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని జమ్మలమడుగు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంధం సునీల్‌కుమార్ కోరారు. జమ్మలమడుగు అసెంబ్లీ స్థానానికి పోటీ చేయుటకు అవకాశం కల్పించాలని విజయవాడలో దరఖాస్తు దాఖలు చేశారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పాల్గొన్నారు.

3న 'పల్స్ పోలియో'ను విజయవంతం చేయాలి

ఎర్రగుంట్ల: మార్చి 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఎంహెచ్ఒ నాగరాజు సూచించారు. మండల పరిధిలోని చిలంకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రసూతి గది, ఐపి, ల్యాబ్‌ను పరిశీలించారు. గర్భిణుల నమోదును, పిల్లల నమోదును వేగవంతం చేయాలని ఆదేశించారు. శుక్రవారం నిర్వహించే జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా అల్బెండజోల్ మందులను అన్ని పాఠశాలలకు పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు సుచరితరెడ్డి, గణేష్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ నాగ మునిరెడ్డి, హెల్త్ సూపర్వైజర్, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు సమస్యలపై దృష్టి సారించేనా?

గుండ్ల వంకపై ప్రస్తుతం ఉన్న లో లెవెల్ బ్రిడ్జి, కోతకు గురవుతున్న కుందూనది

ప్రజాశక్తి - చాపాడు

ఎన్నికలు సమీపిస్తున్న వేళ మండల పరిధిలోని పలు ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మండల పరిధిలో కొన్నేళ్లుగా పేరుకుపోయిన సమస్యలు అనేకం ఉన్నాయి. సర్పంచులకు వస్తున్న అరకొర నిధులతో స్థానికంగా ఉన్న సమస్యల పరిష్కారం వీలుకాదు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మండల పరిధిలో ఆర్అండ్‌బి రోడ్లు చాలా వరకు మెరుగుపడ్డాయి. గతంలో అల్లాడుపల్లె, చిన్న గురువలూరు రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉండేది. ఆనందాశ్రమం, మొర్రాయపల్లి రోడ్డు, టిఒ పల్లె, గుంత చియపాడు, రేపల్లె రహదారి చాలా అధ్వానంగా ఉండగా.. నూతనంగా రోడ్లు వేసి సమస్యను పరిష్కరించారు. గుంతచియ్యపాడు, తిప్పిరెడ్డిపల్లి, చాపాడు గ్రామాల మధ్య వంకలపై ఉన్న బ్రిడ్జీలు ఎత్తు పెంచాల్సిన అవసరం ఉంది. తిప్పిరెడ్డిపల్లె వద్ద మాత్రమే ఏర్పాటు చేశారు. సోమాపురం దళితవాడ, సిద్దారెడ్డిపల్లె-జడ్డిగారి కొట్టాల్, నాగాయపల్లె-నెర్రవాడ గ్రామాల అధ్వానంగా ఉన్న రహ దారులను ఏర్పాటు చేయాల్సి ఉంది. కుందూ నదికి వరదలు వస్తే ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. మండల పరిధిలో రజకులకు దోభీ ఘాట్లు లేక కుందూనది, కెసి కాలువల వద్ద వారు ఇబ్బందులు పడుతున్నారు. వీలైనన్ని చోట్ల దోభీ ఘాట్ల ఏర్పాటుకు కృషి చేయాల్సి ఉంది. కుందూ నదికి వరదలు వచ్చినప్పుడు పొలాలు కోతకు గురవుతున్నాయి. కరకట్టలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై మండల కేంద్రమైన చాపాడు, అల్లాడుపల్లె, బద్రిపల్లె గ్రామాల వద్ద బస్టాండ్‌లను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ప్రయాణికులు నానా అవ స్థలు పడుతున్నారు. అలాగే చియ్యపాడు, సీతారామపురం, సోమాపురం, మడూరు గ్రామాల మీదుగా ఆర్టీసీ బస్సులను నడపాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఆటోలలో అసౌకర్యంగా ప్రయాణించాల్సి వస్తున్నది. వీటితోపాటు మండలంలో సిమెంటు రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థలో మార్పులు తీసు కురా వాల్సి ఉంది. చియ్యపాడు, ఖాదర్‌పల్లె తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తుతున్నది. నిధులు మంజూరు చేసి నూతనంగా బోర్లు వేయా ల్సి ఉంది. ప్రజలను ఎన్నికల ప్రలోభాలకు లోను చేయకుండా నిధులు మం జూరుకు హామీ ఇచ్చి గ్రామ పంచాయతీల అభివృద్ధికి నాయకులు కృషి చేయాల్సి ఉంది.

డబ్బుతో తృప్తిపరుస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి

ఏడాది నుంచి పులివెందులలో మొదలైన డబ్బు పంపకం వారం రోజులుగా జమ్మలమడుగులో కూడా డబ్బు సంచులతో వైసిపి నేతలు రాత్రిపూట తిరుగుతున్నారని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారం రోజుల నుండి నియోజకవర్గంలో దాదాపు రూ.2 కోట్లు పంచారన్నారు. రోజురోజుకూ భూపేష్‌రెడ్డి సారథ్యంలో టిడిపి బలపడి గెలుపు వైపు ఉరకలేస్తోందన్నారు. ఈ తరుణంలో కూడా నియోజకవర్గంలో ప్రభుత్వం ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేక పోతోందన్నారు. రెండు సార్లు శంకుస్థాపన చేసిన స్టీల్ ప్లాంట్ పనులు ఒక్క అడుగు ముందుకు పడలేదన్నారు. అటు గండికోట ముంపు బాధితులు, ఇటు రాజోలి ప్రాజెక్టు, స్టీల్ ప్లాంట్ కోసం భూములు కోల్పోయిన బాధితుల బాధలు తీర్చలేక పోయారన్నారు. వైసిపి అధికారంలోకి తెచ్చిన నాయకులు, కార్యకర్తలు ఈ నాలుగున్నర ఏళ్ల కాలంలో చాలా బాధలు పడ్డారన్నారు. కనీసం గౌరవం కూడా వారికి ఇవ్వకపోవడంతో వారు టిడిపి వైపు మొగ్గు చూపుతున్నారని.. దోచుకున్న డబ్బులను బయటకు తీసి నాయకులను తృప్తి పరచడానికి లక్షల్లో రాత్రిపూట పంచుతున్నారని ఆయన విమర్శించారు. సిమెంట్, సోలార్, ముద్దనూరు సిలికాన్ ఫ్యాక్టరీల వద్ద యాజమాన్యాన్ని బెదిరించి వసూలు చేసిన సొమ్ము చాలదనట్లు, రాజకీయ పదవులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు వంటి చిన్న ఉద్యోగాలను సైతం అమ్ముకొని కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. అండగా నిలబడి గెలిపించిన వ్యక్తులను పట్టించుకున్న పాపాన ఎమ్మెల్యే లేడన్నారు. నాయకులకు డబ్బు సంచులు ఒకవైపు, ఇక ఓటుకు రూ.5000 పంచి గెలుస్తానని పగల్బాలు పలుకుతున్నారన్నారు. పెద్ద పసుపల రోడ్డు, ఆళ్లగడ్డ, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల రోడ్డు సక్రమంగా లేక ప్రజల అవస్థలు పడుతుంటే పట్టించుకోని నాయకుడు మనకు అవసరమా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే పంచే డబ్బంతా పాపపు సొమ్మేనని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వీలైనంత ఎమ్మెల్యే నుంచి కక్కించాలని ఆయన కోరారు. ఈ ఐదేళ్లు మీకు పెట్టిన అవమానాలు, కష్టాలకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుబ్బరాజా పాల్గొన్నారు.

ప్రతి రైతూ లబ్ధి పొందేలా చూడాలి : డిఎఒ

సిబ్బందికి సూచనలిస్తున్న డిఎఒ నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి రైతుకు అందేలా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు సిబ్బందికి సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో బుధవారం ముద్దనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకట సుబ్బయ్య అధ్యక్షతన డిఎఒ నాగేశ్వరరావు క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డిఎఒ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పంట నమోదు, ఇకెవైసి గురించి గ్రామాల వారీగా ఆర్‌బికె సిబ్బందితో చర్చించారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి రైతుకు అందేలా చూడాలన్నారు. పిఎం కిసాన్, ఇకెవైసి పూర్తి చేయాలని సూచించారు. క్రిమిసంహారక మందులు అవసరం ఉన్న రైతులతో ఇండెంట్ పెట్టించాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. సమయ పాలన పాటించి రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. రిజిస్టర్లు సక్రమంగా రాసి ఉంచుకోవాలన్నారు. డిఎఒ కార్యాలయం ఎడిఎ మాధవి మాట్లాడుతూ ఆర్‌బికెలో రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎఒ వెంకటకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉజ్వల భవిష్యత్తు కోసం చదవండి'

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మాట్లాడుతున్న డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి

ఉజ్వల భవిష్యత్తు కోసం విద్యార్థులు చదవాలని ప్రముఖ డాక్టర్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కమిటీ ప్రెసిడెంట్, కళాశాల వ్యవస్థాపకులలో ఒకరైన ఎంఎల్ నారాయణరెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతు రావు అధ్యక్షతన ఫేర్వెల్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఎల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ జీవితం చాలా విలువైందని, అందుకు తగ్గట్లు తల్లిదండ్రులు చదివించడం చాలా గొప్ప విషయమన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు, ఆలోచనల మేరకు ప్రతి సబ్జెక్టును ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ప్రిన్సిపల్ హనుమంతరావు మాట్లాడుతూ జమ్మలమడుగు పట్టణంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల రావడానికి కృషి చేసిన వారిలో డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి ఒకరన్నారు. 1982 నుంచి నేటి వరకు ఎంతోమంది బాలికల చదువుకు ఈ కళాశాల నిలయమైందన్నారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ మురళీధర్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది భూతమాపురం వెంకట సుబ్బారావు, మైలవరం, ఎర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్ నాగభూషణ్‌రెడ్డి, త్రివిక్రమ్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులందరూ పరీక్షలు బాగా రాయాలని శుభాకాంక్షలు తెలిపారు. కళాశాలలోని నలుగురు టాపర్సును ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.500 నగదును బహుమతిగా అందజేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అభివృద్ధికి నోచని గండికోట, మైలవరం జలాశయం

మైలవరం జలాశయాన్ని సందర్శిస్తున్న సిఐటియు నాయకులు

మైలవరం : మైలవరం జలాశయాన్ని సిఐటియు నాయకులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ మాట్లాడుతూ జలాశయం ప్రహరీ, విద్యుత్ స్తంభాలు, కట్టడాలను పరిశీలించామన్నారు. గండికోట, మైలవరం జలాశయం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నాలుగున్నర సంవత్సరాల నుంచి ఏమాత్రం అభివృద్ధిపై ధ్యాస పెట్టని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మైలవరం జలాశయానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సందర్శకులు, పర్యాటకులు చుట్టుపక్కల ఉన్న చాలామంది ఇక్కడికి వస్తుంటారు. మత్స్యకారులు కూడా ఇదే వంతెనపై రాత్రి వేళ ప్రయాణం చేస్తుంటారని తెలిపారు. వంతెన ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదన్నారు. చాలావరకు ఇరువైపులా ప్రహరీ కుంగిపోయిందన్నారు. ఉన్నతాధికారులు వీటిపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆదాము, అబ్రహం, నరేంద్ర, రవిరావు, హుస్సేన్ పాల్గొన్నారు.

15 నుంచి ఎన్నికల ప్రచారం : ఎమ్మెల్యే రాచమల్లు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

ఈనెల 15నుంచి సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రచారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు నియోజకవర్గానికి వైసిపి తరపున తన పేరు ఖరారైనందున ఎన్నికల ప్రచారం మొదలుపెడతామని ఆయన పేర్కొన్నారు. స్థానిక నడింపల్లిలో 17వ వార్డు కౌన్సిలర్ చరితారెడ్డి ఇంటి వద్ద బుధవారం రాచమల్లు విలేకరుల సమావేశంలో మాటాడుతూ తనను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. మూడవసారి కూడా గెలిపించాలని ఆయన కోరారు. నేడు టిడిపి టికెట్‌కు పోటీ పడుతున్న నాయకులు గత కరోనా కాలంలో ఏమయ్యారని ప్రశ్నించారు. ఒక్క ముక్తియార్ అరకొర ప్రజాసేవ చేయడం మినహా మిగిలిన నాయకులు కరోనా కాలంలో పత్తా లేకుండా పోయారన్నారు. తమ కౌన్సిల ర్లను ప్రలోభపెట్టడం సమంజసం కాదన్నారు. 20 మంది కౌన్సిలర్లను ఒక్కొక్కరికి రూ.12.50లక్షలకు ప్రలోభాలకు గురిచేశారన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల్లో ధర్మయుద్ధం చేయాలన్నారు. కొంతమంది కౌన్సిలర్ల ఆర్థిక అవసరాలను సాకుగా తీసుకొని ప్రలోభాలకు గురిచేసినా అందరూ తమ వెంటే ఉన్నారని 41వార్డుల కౌన్సిలర్ల గురించి వివరించారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు, ఎస్‌పికి, స్థానిక డిఎస్‌పికి ఫిర్యాదు చేస్తామన్నారు. రాజకీయాలను కలుషితం చేయవద్దని టిడిపి నాయకులకు సలహా ఇచ్చారు. అధర్మయుద్ధానికి పాల్పడవద్దని మొదటిసారి కోరుతున్నానని, తీరుమారకపోతే రెడవ సారి దండన ఉంటుందని ఎమ్మెల్యే రాచమల్లు అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీదేవి కౌన్సిలర్లు, జెడ్పిటిసిలు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం ఆందోళన ఉధృతం

ప్రజాశక్తి - (పొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

లబ్ధిదారులతో ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

అమృత్‌నగర్ వాసులకు మౌలిక వసతులు కల్పించాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో చేస్తున్న ధర్నా రోజురోజుకూ ఉధృత మవుతోంది. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నా బుధవారానికి 15వ రోజుకు చేరు కుంది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లా డుతూ 2008లో ప్రభుత్వం అమృత్‌నగర్‌లోని లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చి వారికి మౌలిక వసతులు కల్పించలేదన్నారు. పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. 15ఏళ్లుగా అధికారులు చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. మరోపక్క కబ్జాదారులతో తమ ప్లాట్ ఉంటుందో ఊడుతుందో తెలియని పరిస్థితిలో లబ్ధిదారులు ఉన్నారన్నారు. ఆందోళనలో లత, హసీనా, రఫీ రమీజా, బాబు, మధు, ముంతాజ్, హుస్సేన్ బాషా, పార్వతి, రాములమ్మ, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి అవకాశం ఉన్నా, చర్యలు చేపట్టకుండా మున్సిపల్ అధికారులు, పాలకులు కాలయాపన చేస్తున్నారని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ పేర్కొన్నారు. ఆ మేరకు బుధవారం ఆయన మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పది రోజులుగా పట్టణ పరిధిలోని తాగునీటి బోర్లలో నీటి శాతం తగ్గి ప్రజలకు సరిగా నీరు అందడం లేదన్నారు. సమస్య పరిష్కారానికి గతంలో ఎర్రచెరువుకు ఏకర్లపాలెం దగ్గర ఉన్న తెలుగుగంగ ప్రాజెక్టు డ్యాం నుండి నీటిని నింపడం వల్ల బోర్లలో నీటి శాతం పెరిగిందన్నారు. ఈ ఏడాది ఇప్పటికి కూడా చెరువుకు నీటిని నింపే కార్యక్రమానికి పాలకులు, అధికారులు చర్యలు చేపట్టలేదని తెలిపారు. ఇప్పటికైనా ఎర్రచెరువుకు నీటిని నింపే చర్యలు తీసుకోవాలన్నారు. లేనిచో ఈనెల 12న మైదుకూరు మున్సిపల్ కార్యాలయన్ని రైతు సేవాసమితి ఆధ్వర్యంలో పట్టణ ప్రజలను కలుపుకొని ముట్టడిస్తామని హెచ్చరించారు. రైతుసేవా సమితి పట్టణ నాయకులు శ్రీనివాసులు, పుష్పరాజు పాల్గొన్నారు.

సిఎం చేతులెత్తేయడం శోచనీయం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రానికి ప్రత్యేకహోదా విషయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతులు పైకెత్తడం శోచనీయమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆడలేక మద్దెల ఓడు అన్నట్లుంది సిఎం జగన్ తీరు అన్నారు. ప్రత్యేకహోదాకు చట్టం అవసరం లేదని ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ మాత్రమే చాలునని చెప్పారు. లోక్‌సభలో బిజెపికి వైసిపి అవసరం లేనప్పటికీ, రాజ్యసభలో ఆ అవసరం వచ్చిందన్నారు. అయినప్పటికి పిరికితనంతో వైసిపి బిజెపిని ప్రశ్నించలేదని మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా అనేది ఎండమావిగా కనిపిస్తున్నట్లు జగన్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తమపై ఆధారపడే ప్రభుత్వం కేంద్రంలో వస్తే తప్పా హోదా సాధ్యం కాదని సిఎం అసెంబ్లీలో మాట్లాడడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మొదటిరోజు నుంచే ఎపిలో ప్రత్యేకహోదా అమలవుతుందని చెప్పారు. మూడవసారి అధికారంలోకి వస్తామని మోడీ పగటి కలలు కంటున్నారని పేర్కొన్నారు.

నులి పురుగుల నివారణకు సహకరించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

నులి పురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపిడిఒ సంపతి దివిజ కోరారు. బుధవారం తాళ్ళపల్లె వైద్య ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నులి పురుగుల నివారణకు సంబంధించిన గోడ పత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా అల్బెండాజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం నుండి మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు, కళాశాలు, అంగన్వాడీ పాఠశాల్లో ప్రతి విద్యార్థికి అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రభుత్వ వైద్యురాలు స్వాతిసాయి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ షఫివున్నిషా బేగం, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, సిహెచ్ఒ బసయ్య, ఎఎన్ఎం శారద పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : నులిపురుగులను నివారించి ఆరోగ్యంగా జీవించాలని వైయంఆర్ కాలనీలోని యుహెచ్‌సి వైద్యాధికారులు శివప్రసాదరెడ్డి, హిమబిందు పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఈ నెల 9న జాతీయ నులిపురుగల నిర్మూలనా దినం రోజున 1 నుండి 19 సంవత్సరముల పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు. 4 నెలలనుండి 9 నెలల గర్భిణులకు కూడా మింగించాలన్నారు. దీనివల్ల రక్తహీనత నివారణ అవుతుందన్నారు. చదువుపై ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ఆకలి బాగా అవుతుందన్నారు. మనిషి ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిర్డ్స్ సొసైటీ అధ్యక్షులు సుబ్బారెడ్డి, ఆశాలు పాల్గొన్నారు.

చిన్న సమస్యలకు గొడవ పడొద్దు : డిఎస్‌పి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గ్రామాల్లో చిన్నచిన్న సమస్యలకు గొడవ పడొద్దు అని పులివెందుల డిఎస్‌పి వినోద్‌కుమార్ కోరారు. బుధవారం మండలంలోని గురజాలలో పోలీసులు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సామరస్యంగా వ్యవహరించాలన్నారు. ఎలాంటి గొడవలుకు పాల్పడినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రూరల్ సిఐ బాల మద్దిలేటి, ఎస్ఐ అనిల్‌కుమార్ పాల్గొన్నారు

అట్టహాసంగా వీడ్కోలు ఉత్సవం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

శ్రీ చైతన్య డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన పేర్ వెల్ వీడ్కోలు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిపైర్డ్ జంతుశాస్త్ర ఆచార్యులు ప్రొఫెసర్ కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో చక్కటి ప్రణాళికాబద్ధంగా నడుచుకొని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. బాగా చదివి మంచి ర్యాంకులు సాధించి తల్లిదండ్రులకు, కళాశాల యజమాన్యానికి మంచి గుర్తింపు తీసుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కళాశాల కరస్పాండెంట్ ఎ.నారాయణ రెడ్డి మాట్లాడుతూ కళాశాల స్థాపించిన తక్కువ కాలంలోనే విద్యార్థులను ఉత్తమంగా తీర్చిది ద్దామన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు పలు పాటలకు నృత్యాలు చేశారు. కార్యక్ర మంలో శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల సాయిచైతన్య, ఎ.నీరజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

రైతు బజారుతో రైతులు, ప్రజలకు మేలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రైతులు, ప్రజలకు మేలు చేయాలని ఉద్దేశంతోనే రైతు బజార్‌ను ఏర్పాటు చేశామని మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, వైస్‌చైర్మన్ సర్వోత్తమ్‌రెడ్డి తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 15 నుంచి కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు నేరుగా రైతుబజార్‌లో అమ్ముకొనుటకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు ఖర్చు తగ్గడంతోపాటు వినియోగదారునికి తక్కువ ధరకే లభిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల, పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని ఆయన వారు కోరారు.

శ్రీ రామస్వామి దేవాలయం
యస్.సి కాలనీ, కొరగుంట్లపల్లి(గ్రా), సింహాద్రిపురం (మం), కడప జిల్లా.
e-Procurement Tender
NIT NO. P/COE/163/2024-14 Dt: 25/10/2024
దేవాలయ పున: నిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
ఇట్లు : ధర్మకర్త